సాక్షి ఖమ్మం

సోమవారం ǀ 8 ǀ సెప్టెంబర్ ǀ 2025



సాగు యంత్రాలు అందించండి..

పంటల సాగులో రైతులకు ప్రయోజనం కలిగించేలా రూపొందించిన యాంత్రీకరణ పథకం అమలులో జాప్యం జరుగుతోంది. 8లో



బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపిక

బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపికలను బోనకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం నిర్వహించారు. 8లో

గరిష్టం / కనిష్టం

33° / 24°

వాతావరణం

జిల్లాలో సోమవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. అక్కడక్కడా చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జమలాపురం ఆలయం మూసివేత



ఆలయ తలుపులు మూస్తున్న అర్చకులు

ఎర్రుపాలెం: చంద్రగ్రహణం సందర్భంగా జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయాన్ని అర్చకులు ఆదివారం మధ్యాహ్నం మూసివేశారు. సోమవారం ఉదయం 6 గంటలకు ఆలయ శుద్ధి, సంప్రోక్షణ చేశాక ఉదయం 10 గంటల నుంచి తిరిగి భక్తుల దర్శనానికి అనుమతి ఇస్తామని ప్రధానార్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ తెలిపారు. కాగా, మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న ఆలయాలను కూడా అధికారులు, అర్చకులు మూసివేశారు.

ఓటరు జాబితాపై నేడు సమావేశం

ఖమ్మం సహకారనగర్ : స్థానిక సంస్థల ఓటర్ జాబితాపై సోమవారం సాయంత్రం 4.30 గంటలకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నట్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల వారీగా ఓటర్ జాబితా, పోలింగ్ స్టేషన్ల జాబితా తయారీ కోసం ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి ఆయా పార్టీల ప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

గణేశ్ లడ్డూ రూ.2.42 లక్షలు



గణపతి లడ్డూ దక్కించుకున్న భక్తులు

మధిర : మండల పరిధిలోని దెందుకూరులో బాలగణేష్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాగణపతి 40కేజీల లడ్డూకు ఆదివారం వేలం నిర్వహించగా శ్రీరామ్‌నగర్‌కు చెందిన గుర్రం సాయి, మల్లెల నరేంద్ర, కుర్రా నవీన్ రూ.2,42,116కు దక్కించుకున్నారు.

రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తా



బంగారు పతకం అందుకుంటున్న టోనిశ్రీ

ఖమ్మం స్పోర్ట్స్ : ఖేలో ఇండియా మహిళల లీగ్ పోటీల్లో భాగంగా హైదరాబాద్‌లో జరిగిన మహిళల వెయిట్ లిఫ్టింగ్ రాష్ట్రస్థాయి పోటీల్లో ఖమ్మానికి చెందిన ఎ.టోనిశ్రీ ప్రథమస్థానం సాధించి బంగారు పతకం గెలుచుకుంది. మహిళల 53 కేజీల కేటగిరీలో స్నాచ్ 53, క్లీన్ అండ్ జర్క్ 65 కేజీలు మొత్తం 118 కేజీల బరువులెత్తగా ఆమెకు బంగారు పతకం అందించారు. అంతేకాక ఖేలో ఇండియా జాతీయస్థాయి పోటీలకు కూడా ఎంపికైంది.

ఎన్‌ఎంఎంఎస్‌కు దరఖాస్తు చేసుకోండి

ఖమ్మం సహకారనగర్: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్) కోసం 8వ తరగతి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని అదనపు కలెక్టర్, డీఈఓ శ్రీజ సూచించారు. అక్టోబర్ 6వ తేదీ వరకు http://bse.telangana.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఓసీ, బీసీలు రూ.100, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ విద్యార్థులైతే రూ.50 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పరీక్ష నవంబర్ 23వ తేదీన ఉదయం 9–30గంటల నుంచి మధ్యాహ్నం 12–30గంటల వరకు జరుగుతుందని తెలిపారు.

రేపు జాబ్‌మేళా

ఖమ్మం రాపర్తినగర్ : జిల్లాలోని నిరుద్యోగ యువతకు రిలయన్స్ నిప్పన్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈనెల 9న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి కొండపల్లి శ్రీరామ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రిలేషన్‌షిప్ మేనేజర్ పోస్టులు 25 ఖాళీగా ఉండగా భర్తీకి నిర్వహించే జాబ్ మేళాకు 18 – 45 ఏళ్ల మధ్య వయసు గల వారు అర్హులని పేర్కొన్నారు. వేతనం రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు ఉంటుందని, ఆసక్తి గలవారు జిరాక్స్ కాపీలతో రిలయన్స్ నిప్పన్ లైఫ్ ఇన్సూరెన్స్, కొటక్ మహీంద్ర బ్యాంక్, గాంధీచౌక్, ఖమ్మంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

ఇంటి పంట.. ఎంతో మేలంట!

అంగన్‌వాడీ కేంద్రాల్లోనే కూరగాయల సాగు

- చిన్నారులు, గర్భిణులకు పోషకాహారం అందించేలా చర్యలు
- కిచెన్ గార్డెన్ల ఏర్పాటుకు నిధులు మంజూరు



జలగం నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పెంచుతున్న ఆకు కూరలు

ఖమ్మంమయూరిసెంటర్ : చిన్నారులు, గర్భిణులకు పోషకాహారం అందించడంలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ కేంద్రాల్లో అందించే ఆహారంలో వినియోగించే ఆకు కూరలు, కూరగాయలు అక్కడే పండించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు కిచెన్ గార్డెన్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేసింది. తద్వారా అంగన్‌వాడీలకు వచ్చే చిన్నారులు, బాలింతలకు నాణ్యమైన, పోషకాహారం అందనుంది.

రూ.10 వేల చొప్పున విడుదల..

జిల్లాలో ఎంపిక చేసిన 159 అంగన్‌వాడీ కేంద్రాల్లో కిచెన్ గార్డెన్ల ఏర్పాటుకు రూ.10వేల చొప్పున నిధులు కేటాయించగా ఆవరణల్లో తోటలు, కుండీల్లో కూరగాయలు, ఆకుకూరలు పెంచనున్నారు. బయట మార్కెట్లపై ఆధారపడకుండా, రసాయన ఎరువులు లేకుండా సేంద్రియ కూరగాయలు పండించడం ద్వారా ఆహార నాణ్యత పెరుగుతుందని అధికారులు అంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలకు పౌష్టికాహార లోపం తీవ్ర సమస్యగా మారింది. ఆయా సెంటర్ల ఆవరణల్లో వంకాయ, బెండ, టమాటా, గోంగూర, తోటకూర, పాలకూర వంటివి పెంచుతుండగా పిల్లలకు అవసరమైన విటమిన్లు, మినరల్స్, ప్రొటీన్లు అందించి, శారీరక, మానసిక ఎదుగుదలకు తోడ్పడనున్నాయి.

పిల్లలకూ అవగాహన..

కూరగాయలు, ఆకు కూరల తోటల పెంపకంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలది కీలక పాత్ర. తోటల నిర్వహణలో పిల్లలను కూడా భాగస్వామ్యం చేయడం ద్వారా వారికి వ్యవసాయం, పర్యావరణంపై అవగాహన కల్పించొచ్చు. కూరగాయలు ఎలా పండుతాయి, వాటిని ఎలా సంరక్షించాలి అనే విషయాలు నేరుగా అనుభవం ద్వారా తెలుస్తాయి. ఇది ఒక రకంగా ప్రయోగాత్మక విద్యగా కూడా ఉపయోగపడుతుందని అధికారులు అంటున్నారు.

నిధుల వినియోగంపై శిక్షణ..

ఒక్కో అంగన్‌వాడీ సెంటర్‌కు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10 వేల నిధులు ఎలా వినియోగించాలి, ఏ మొక్కలు నాటాలి, తోటను ఎలా నిర్వహించాలి అనే విషయాలపై టీచర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ నిధులతో విత్తనాలు, కుండీలు, మట్టి, ఇతర పనిముట్ల కొనుగోలుకు వినియోగించాల్సి ఉంటుంది. ఐదేళ్ల పాటు కిచెన్ గార్డెన్లను నిర్వహించాల్సి ఉంది. అయితే ఈ కార్యక్రమం విజయవంతం కావాలంటే పటిష్ట పర్యవేక్షణ అవసరమని తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు.

విత్తనాల సరఫరా..

నేలకొండపల్లి: కూరగాయలు, ఆకుకూరల పెంపకానికి పక్కా అంగన్‌వాడీ భవనాలు, సొంత స్థలాలు, నీటి సరఫరా, ప్రహరీ ఉన్న కేంద్రాలను ఎంపిక చేశారు. ప్రతీ కేంద్రానికి టమాటా, బెండకాయ, వంకాయతో పాటు ఆకుకూరల సాగుకు అవసరమైన విత్తన ప్యాకెట్లను కూడా ప్రభుత్వం సరఫరా చేసింది.

పోషకాహారం అందించేందుకే..



అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించేందుకే సొంతంగా కూరగాయల సాగు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం జిల్లాలో అన్ని సౌకర్యాలు గల 159 కేంద్రాలను ప్రస్తుతానికి ఎంపిక చేశాం. ఆయా సెంటర్లకు విత్తనాలు ఇప్పటికే పంపిణీ చేయగా నిర్వహణ ఖర్చులు కూడా అందిస్తాం.

– రామ్‌గోపాల్‌రెడ్డి, డీడబ్ల్యూఓ, ఖమ్మం

23 నుంచి దసరా వేడుకలు

- రామాలయంలో రోజుకో అలంకరణలో మహాలక్ష్మి దర్శనం
- అక్టోబర్ 2న శమీ, ఆయుధ పూజ, శ్రీ లీలా మహోత్సవం
- 7న శబరి స్మృతియాత్ర, వాల్మీకి జయంతి

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ఈ నెల 23 నుంచి శ్రీదేవి శరన్నవ రాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఆలయ అధికారులు అశ్వయుజ మాసంలో జరిగే ఉత్సవాలు, విజయ దశమి వేడుకల వివరాలను వెల్లడించారు. అక్టోబర్ 2న జరిగే విజయదశమి వేడుకలతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఆలయంలో కొలువై ఉన్న శ్రీ మహాలక్ష్మి అమ్మవారు 23 నుంచి రోజుకో అలంకరణలో భక్తులకు కనువిందు చేయనున్నారు. అక్టోబర్ 7న శబరి స్మృతియాత్ర నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ దామోదర్‌రావు, వైదిక కమిటీ సభ్యులు తెలిపారు.

తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ప్రతీ ఏడాది తొమ్మిది రోజులపాటు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేస్తారు. స్వామివారి సన్నిధిలో తొమ్మిది రోజులపాటు అంగరంగ వైభవంగా వేడుకలు జరుపుతారు. దశమి రోజున భక్తరామదాసు నిర్మించిన దసరా మండపంలో శమీ, ఆయుధ పూజలు, లీలా మహోత్సవం కనుల పండువగా నిర్వహిస్తారు. కాగా ఆలయ ప్రాంగణంలోని చిత్రకూట మండపంలో 24 నుంచి 2వ తేదీ వరకు శ్రీరామాయణ పారాయణం జరగనుంది. ఇందులో భక్తులను, స్వామి వారి ఆరాధకులను ఈ ఏడాది భాగస్వామ్యం చేయనున్నారు. శ్రీలక్ష్మి అమ్మవారి సన్నిధిలో అభిషేకం, చిత్రకూట మండపంలో సామూహిక శ్రీ రామాయణ పారాయణం, మధ్యాహ్నం శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి సన్నిధిలో సామూహిక కుంకుమార్చనలు జరగనున్నాయి. అక్టోబర్ 2న శమీ, ఆయుధ పూజ, శ్రీ లీలా మహోత్సవం నిర్వహించనున్నారు.



విజయదశమి రోజున సీతాలక్ష్మణ సమేతుడైన రామయ్య(ఫైల్)

వచ్చేనెల 7 శబరి స్మృతి యాత్ర

అక్టోబర్ 7వ తేదీన అశ్వయుజ మాస పౌర్ణమి సందర్భంగా శబరి స్మృతి యాత్రను జరపనున్నారు. రాముడి అపర భక్తురాలు శబరికి ఫల, పుష్పాలతో అంజలి ఘటించనున్నారు. అదే రోజున వాల్మీకి జయంతి వేడుకలకు సన్నాహాలు చేస్తున్నారు. అక్టోబర్ 20వ తేదీన నరక చతుర్దశి దీపావళి సందర్భంగా మూలమూర్తులకు తెల్లవారుజామున అభిషేకం, సాయంత్రం మంగళ స్నానాలు, ఇతర ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

తేదీ	అలంకారం	పారాయణం
ఈనెల 23న	ఆదిలక్ష్మి	బాలకాండ
24న	సంతాన లక్ష్మి	అయోధ్యకాండ
25న	గజలక్ష్మి	అయోధ్యకాండ
26న	ధనలక్ష్మి	అరణ్యకాండ
27న	ధాన్య లక్ష్మి	కిష్కింధకాండ
28న	విజయలక్ష్మి	సుందరకాండ
29న	ఐశ్వర్యలక్ష్మి	యుద్ధకాండ
30న	వీరలక్ష్మి	యుద్ధకాండ
అక్టోబర్ 1న	మహాలక్ష్మి (నిజరూప)	యుద్ధకాండ

'జూనియర్'లో జోరు..

- ప్రభుత్వ కళాశాలల్లో పెరిగిన అడ్మిషన్లు
- ఈ ఏడాది ఇంటర్ ప్రథమలో 3,287 మంది..
- గతేడాది ప్రవేశాలు 2,494 మాత్రమే
- ప్రభుత్వ కాలేజీల్లో సౌకర్యాలపై విస్తృత ప్రచారం



వైరాలో ప్రచారం నిర్వహిస్తున్న ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు

అడ్మిషన్ల వివరాలిలా

కేటగిరి	2024-25	2025-26
జనరల్	1,630	2,101
ఒకేషనల్	864	1186
మొత్తం	2,494	3,287

ఖమ్మంసహకారనగర్: ఒకప్పుడు ప్రభుత్వ కళాశాలలు అంటే అంతంతమాత్రపు సౌకర్యాలు, అందీఅందని పుస్తకాల వంటి సమస్యలు ఉండేవి. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చేర్పించేందుకు అంతగా ఆసక్తి చూపేవారు కాదు. అయితే సర్కారు కళాశాలల్లో క్రమంగా సౌకర్యాలు పెంచడం, అడ్మిషన్ల పెంపునకు అధ్యాపకులు గ్రామాల్లో తిరుగుతూ తల్లిదండ్రులను ప్రోత్సహించడం వంటి చర్యలతో క్రమంగా విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. ఈ విద్యా సంవత్సర ప్రవేశాల గడువు ఆగస్టు 31తో ముగియగా 3,287 మంది ఇంటర్ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్లు పొందారు. జిల్లాలో 21 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా.. వీటిలో గతేడాది 2,494 మంది విద్యార్థులు ప్రథమ సంవత్సరంలో చేరారు. ఈ సంవత్సరం 793 మంది అధికంగా చేరడం విశేషం.

సౌకర్యాల పెంపుతోనే..

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గతంలో విద్యాబోధనతోనే సరిపుచ్చగా.. ప్రస్తుతం విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, కనీస సౌకర్యాలు కల్పిస్తున్నారు. ప్రైవేట్ కాలేజీలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలు ఉండాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ఎప్‌సెట్ కోచింగ్ సైతం అందిస్తోంది. ఎక్కడా అధ్యాపకుల కొరత లేకుండా చర్యలు చేపడుతోంది. ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు పెంచేందుకు ఫిబ్రవరి, మార్చి నెలల నుంచే అధ్యాపకులు గ్రామాలకు వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. అంతేకాక ఫలితాలు వెల్లడయ్యాక తాము సాధించిన రిజల్ట్‌పై కరపత్రాల ద్వారా విస్తృత ప్రచారం చేశారు. ఎంసెట్ కోచింగ్, విద్యార్థులకు అందించే వ్యక్తిత్వ వికాస తరగతులు తదితర అంశాలను వివరిస్తున్నారు. ఈ క్రమంలో ప్రవేశాల సంఖ్య పెరిగినట్లు తెలుస్తోంది.

మూడు కాలేజీలు మినహా..

జిల్లాలో 21 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా అందులో ఒకటి గతేడాది, మరొకటి అంతకు ముందు సంవత్సరం ప్రారంభించారు. మొత్తంగా మూడు మినహా మిగతా అన్ని కాలేజీల్లోనూ అడ్మిషన్లు గతం కంటే పెరిగాయి. కూసుమంచిలో గతేడాది ప్రారంభమైన కళాశాలలో 53 మంది ఉండగా.. ఈ ఏడాది 93 మందికి పెరిగారు. వేంసూరు మండలం కందుకూరు కళాశాల రెండేళ్ల క్రితం ప్రారంభం కాగా గతేడాది 13 మంది చేరితే ఈసారి ఆ సంఖ్య 17కు మాత్రమే పెరిగింది. ఇక ఖమ్మంలోని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో గతేడాది 435 మంది విద్యార్థులు చేరగా.. ప్రస్తుతం 419 మందికే పరిమితమైంది. కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనూ గతేడాది 100 మంది అడ్మిషన్లు పొందగా ప్రస్తుత సంవత్సరంలో 95 మంది మాత్రమే చేరారు. కామేపల్లి కళాశాలలో గతేడాది 35 మంది చేరగా ఈ ఏడాది 26 మంది మాత్రమే ప్రవేశాలు పొందారు.

విస్తృత ప్రచారంతోనే అడ్మిషన్లు



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాల పెంపునకు ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు విస్తృత ప్రచారం చేశారు. విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, ఫలితాలు, ఎప్‌సెట్ కోచింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు.. ప్రభుత్వ కళాశాలల్లో చేరేలా తల్లిదండ్రులకు విస్తృతంగా అవగాహన కల్పించాం. ఈ అంశాలన్నీ ప్రవేశాల పెంపునకు దోహదపడ్డాయి.

– రవిబాబు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి

కిన్నెరసానిలో పర్యాటక సందడి



జలాశయంలో బోటుషికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. మండల పరిధిలోని కిన్నెరసానికి ఆదివారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివచ్చారు. డ్యామ్, జలాశయం, డీర్ పార్కులను వీక్షించారు. ప్రకృతి అందాలను ఆస్వాదించారు. 410 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించగా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.22,395 ఆదాయం లభించింది. 270 మంది బోటు షికారు చేయగా టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.16,210 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు. కాగా ఆంధ్రప్రదేశ్ జెన్‌కో డైరెక్టర్ (హైడల్) ఎం.సుజయ్‌కుమార్, ఏపీ ట్రాన్స్‌కో రిటైర్డ్ సీఈ ప్రతాప్‌రెడ్డి, సీలేరు జలవిద్యుత్ కేంద్రం రిటైర్డ్ సీఈ రాంబాబు తదితరులు కిన్నెరసానిని సందర్శించారు.

తెలుగు రాష్ట్రాల్లోనే అధికంగా సాగు

- ఆయిల్‌పామ్ సాగుకు అశ్వారావుపేటనే ఆదిగురువు
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

అశ్వారావుపేటరూరల్: దేశంలో తెలుగు రాష్ట్రాలు తెలంగాణ, ఏపీలోనే అత్యధికంగా ఆయిల్‌పాం తోటలు సాగు చేస్తున్నారని, ఆ తర్వాత కేరళ, కర్నాటక రాష్ట్రాల్లో సాగవుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన అశ్వారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీని సందర్శించారు. గెలల నిల్వలు, కన్వేయర్ బెల్ట్, యంత్రాలతోపాటు పవర్ ప్లాంట్ తనిఖీ చేశారు. అనంతరం జరిగిన విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఆయిల్‌పాం తోటల సాగుకు అశ్వారావుపేట మండలం ఆదిగురువని, ఇక్కడ పంట బాగుందంటేనే మిగిలిన ప్రాంతాల్లో విస్తరిస్తోందని అన్నారు. రంగారెడ్డి జిల్లాలో ఎకరం విలువ రూ.5 కోట్లపైనే ఉన్నా ఆయిల్‌పాం తోటలు సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారని చెప్పారు. సిద్దిపేటలో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తి కాగా ట్రయిల్ రన్ నడుస్తోందని తెలిపారు. వేంసూరు మండలం కల్లూరిగూడెంలో, కొణిజర్లలో పామాయిల్ ఫ్యాక్టరీల నిర్మాణం ఏడాదిలోపు పూర్తవుతుందని అన్నారు. వనపర్తి, బీచ్‌పల్లిలో కూడా ఫ్యాక్టరీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయిల్ పామ్ గెలల టన్ను ధర రూ.25 వేలకు తగ్గకుండా చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రులకు విన్నవించినట్లు తెలిపారు. తొలుత పామాయిల్ తోటలు, ఫ్యాక్టరీ సందర్శనకు వచ్చిన యాద్రాద్రి జిల్లా రైతులు మంత్రిని కలిశారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ అధికారులు సుధాకర్ రెడ్డి, ఫ్యాక్టరీ మేనేజర్లు నాగబాబు, కల్యాణ్, నాయకులు ఆలపాటి రామచంద్రప్రసాద్, మొగళ్లపు చెన్నకేశవరావు, బండి భాస్కర్, జ్యేష్ఠ సత్యనారాయణ చౌదరి, ఎస్కే పాషా, పి.జీవన్‌రావు, రైతులు పాల్గొన్నారు.



ఫ్యాక్టరీలో ఆయిల్‌పామ్ గెలలను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రిటైర్డ్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం

ఖమ్మంమయూరిసెంటర్ : 1975 బ్యాచ్‌కు చెందిన రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం, స్వర్ణోత్సవాలు ఆదివారం ఖమ్మంలో ఘనంగా నిర్వహించారు. కన్వీనర్ బసవరాజు ఉపేందర్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో రిటైర్డ్ ఉద్యోగులు తమ ఉద్యోగ విరమణ తర్వాత మధుర జ్ఞాపకాలను పంచుకుంటూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఎర్నేని రామారావు అధ్యక్షతన జరిగిన సభలో పలువురు మాట్లాడుతూ 1975లో నాటి ఖమ్మం కలెక్టర్ స్వర్గీయ పి.వి.ఆర్.కె.ప్రసాద్ ఉద్యోగ నియామక ఉత్తర్వులు మంజూరు చేశారని స్మరించుకున్నారు. 50 ఏళ్ల క్రితం మొదలైన తమ ప్రయాణం.. కేవలం విధులకే పరిమితం కాకుండా, మానవ విలువలు, స్నేహ బంధం, పరస్పర సహకారానికి నిదర్శనంగా నిలిచిందని వెల్లడించారు. ఈ బంధం ఎల్లప్పుడూ ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టి.రామరావు, మురళీకృష్ణ, సుధాకర్, సుబ్బయ్య, సైదయ్య, ప్రముఖ గాయకుడు గణపతిరాజు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో ఆనాటి ఉద్యోగులు

మహిళా వికాసం



డ్రోన్ వినియోగంపై శిక్షణ పొందుతున్న మహిళలు

- అతివల స్వయం ఉపాధికి ఉచిత శిక్షణ
- ఇప్పటికే 12 వేల మందికి పైగా ట్రైనింగ్
- భోజన, వసతి సౌకర్యాలు కూడా..

ఖమ్మంఅర్బన్: మహిళలు ఆర్థికంగా బలపడాలనే లక్ష్యంతో ఖమ్మం నగరంలోని దుర్గాబాయి మహిళా వికాస కేంద్రం(మహిళా ప్రాంగణం) పని చేస్తోంది. ఇక్కడ ఇప్పటివరకు 12 వేల మందికిపైగా మహిళలు వివిధ కోర్సుల్లో శిక్షణ పొంది ఆర్థికాభివృద్ధి సాధించారు. ఇంకా వందలాది మంది శిక్షణ పొందుతూనే ఉన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన కొందరు మహిళలు మరో బ్యాచ్ వారికి ట్రెయినర్లుగా మారే అవకాశం కూడా ఉందని అధికారులు అంటున్నారు.

శిక్షణతో పాటు వసతి..

మహిళా ప్రాంగణంలో వ్యవసాయం, టైలరింగ్, కంప్యూటర్లు, బ్యూటీషియన్, డ్రోన్ వినియోగం, నర్సింగ్ వంటి కోర్సుల్లో ఉచితంగా శిక్షణ అందిస్తున్నారు. శిక్షణతో పాటు వసతి, భోజన సౌకర్యం కూడా కల్పిస్తున్నారు. పంటల సాగులో డ్రోన్ వినియోగంపై శిక్షణ తీసుకోవాలంటే ప్రైవేట్‌గా అయితే రూ.45వేలు, కంప్యూటర్ కోర్సుకు రూ.20వేలు, నర్సింగ్‌కు రూ.లక్ష వరకు ఖర్చవుతుండగా ఇక్కడ పూర్తి ఉచితంగా నేర్పిస్తున్నారు. పంటలపై పురుగుమందులు పిచికారీ చేయడంలో డ్రోన్ వినియోగం ప్రస్తుతం కీలకంగా మారింది. ఈ కోర్సులో 45 రోజుల పాటు శిక్షణ ఇస్తుండగా ప్రస్తుతం ఉమ్మడి జిల్లాకు చెందిన 30 మంది ట్రైనింగ్ పొందుతున్నారు. టైలరింగ్‌లో రెండు నెలల పాటు శిక్షణ ఇస్తుండగా ప్రస్తుతం 30 మంది, రెండు నెలల కంప్యూటర్ కోర్సులో 30 మంది, 45 రోజుల బ్యూటీషియన్ శిక్షణ పొందుతున్న వారు 20 మంది ఉన్నారు. రెండేళ్ల నర్సింగ్ కోర్సులో 40 మంది మహిళలకు శిక్షణ కొనసాగుతోంది.

మహిళలకు స్వయం ఉపాధి



మహిళలు స్వయం ఉపాధి పొందుతూ సమాజానికి ఆదర్శంగా నిలవాలనేదే లక్ష్యం. ఇప్పటివరకు 12 వేల మందికి పైగా శిక్షణ ఇచ్చాం. ఈ ఏడాది 350 మందికి వివిధ రంగాల్లో శిక్షణ కొనసాగుతోంది. ఉన్నతాధికారుల తోడ్పాటుతో మహిళాభివృద్ధికి కృషి చేస్తున్నాం.

– వేల్పుల విజేత, మహిళా ప్రాంగణం మేనేజర్

డ్రోన్‌తో ఎంతో ఉపయోగం



మేము పదెకరాల్లో పంటలు సాగు చేస్తుంటాం. మాకు డ్రోన్ శిక్షణ చాలా ఉపయోగపడుతోంది. భవిష్యత్‌లో సబ్సిడీపై ప్రభుత్వం డ్రోన్ ఇస్తే మరింత లాభం పొందుతాం. వ్యవసాయ పనుల్లో ప్రస్తుతం కూలీల కొరత తీవ్రంగా ఉంది. డ్రోన్‌తో పురుగు మందుల పిచికారీ ఎంతో సులువుగా ఉంటుంది.

–మారగాని రేణుక, పైనంపల్లి, నేలకొండపల్లి మండలం

పేదలకు సేవ చేసే అవకాశం



నర్సింగ్ కోర్సులో ఉచిత శిక్షణతో పాటు వసతి, భోజనం కూడా ఇస్తున్నారు. కోర్సు పూర్తయితే మా కుటుంబానికి ఉపాధి కల్పించడంతో పాటు పేదలకు సేవ చేసే అవకాశం కలుగుతుంది. మాలాంటి వారికి అవకాశాలు కల్పించి గ్రామాల్లో వినియోగించుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా.

– వెంపటి తేజస్విని, ఖమ్మం

పట్టుదలతో శిక్షణ పొందుతున్నా



రెండేళ్ల నర్సింగ్ శిక్షణ ఉచితంగా పొందుతున్నా. పిల్లలు, కుటుంబసభ్యులకు దూరంగా ఉండాల్సి వచ్చినా.. కష్ట పడితే మా కుటుంబం ఆర్థికంగా బలపడుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలందించేందుకు కూడా అవకాశం ఉంటుంది.

– పులిపాటి ధనలక్ష్మి, నేరెడ, కొణిజర్ల మండలం

సాగు యంత్రాలు అందించండి..



- యంత్ర పథకం అమలులో కాలయాపన
- సాగు కాలం గడుస్తున్నా అన్నదాత చెంతకు చేరని పరికరాలు
- జిల్లాకు రూ.4.37 కోట్ల నిధులు మంజూరు
- దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధంగా ఉన్న రైతులు

ఖమ్మంవ్యవసాయం: పంటల సాగులో రైతులకు ప్రయోజనం కలిగించే విధంగా రూపొందించిన యాంత్రీకరణ పథకం అమలులో కాలయాపన జరుగుతోంది. ఆధునిక యంత్రాలతో వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా యాంత్రీకరణ పథకం రూపుదిద్దుకుంది. పంటల సాగులో వినియోగించే యంత్ర పరికరాలను రైతులకు రాయితీలపై అందించటం ఈ పథకం ఉద్దేశం. ఇది అనాదిగా ఉన్నప్పటికీ రాష్ట్రంలో 2016 – 17 ఆర్థిక సంవత్సరం నుంచి అమలుకు నోచుకోవటం లేదు. మారుతున్న కాలం, ఆధునిక సాంకేతిక విధానాలు అమలులోకి రావటంతో రైతులకు యంత్ర పరికరాల వినియోగంపై ఆసక్తి ఉన్నప్పటికీ ప్రభుత్వం నుంచి సబ్సిడీ యంత్రాలు అందకపోవటం వారిని నిరాశకు గురిచేస్తోంది.

నిధులు మంజూరైనా నిష్ప్రయోజనం

తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించేలా యాంత్రీకరణ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్నాయి. 9 ఏళ్లుగా అమలుకు నోచుకోని ఈ పథకాన్ని 2025–26లో అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వానాకాలానికి ముందు నుంచే సన్నాహాలు చేసింది. అయితే బడ్జెట్ కేటాయింపులు తక్కువగా ఉండటం, పరికరాల ధర అధికంగా ఉండటంతో కొందరికే లాభం చేకూరనుండటంతో పథకం అమలులో మార్పులు తీసుకువచ్చారు. ఎక్కువ మందికి ప్రయోజనం కలిగేలా యంత్ర పరికరాలను ఎంపిక చేసి పథకాన్ని అమలు చేయాలనుకోవడంతో జాప్యం అనివార్యమైంది. ఈ పథకం కింద జిల్లాకు రూ. 4,37,97,000లు మంజూరు చేసింది.

పరిమిత పరికరాలకు అనుమతి

గతంలో యాంత్రీకరణ పథకంలో ఖరీదైన ట్రాక్టర్లు, పంటకోత మిషన్లు, డ్రోన్లతోపాటు నాగళ్లు, పవర్ స్ప్రేయర్లు వంటివి ఇచ్చేవారు. ఈ ఏడాది నిర్దేశించిన పనిముట్లు మాత్రమే ఇవ్వాలని, రూ. 1,000 నుంచి రూ.1.50 లక్షల వరకు సబ్సిడీపై అందించాలని వ్యవసాయ శాఖ నిర్ణయించింది. బ్యాటరీ స్ప్రేయర్లు రూ.1,000, పవర్ స్ప్రేయర్లు రూ. 10 వేలు, రొటోవేటర్లు రూ.50వేలు, సీడ్‌కం ఫర్టిలైజర్ డ్రిల్స్ రూ.30వేలు, కేజీవీల్స్, డిస్కులకు రూ.20 వేలు, పవర్ వీడర్లకు రూ.75వేలు, బండ్ ఫార్మింగ్ యంత్రాలు రూ.1.50లక్షలు, బ్రష్‌కట్టర్లు రూ.35 వేలు, పవర్ టిల్లర్లకు రూ.లక్ష, మొక్కజొన్న వలిచే యంత్రాలు, వరిగడ్డి కట్టలు కట్టే యంత్రాలకు రూ.లక్ష చొప్పున రాయితీ కల్పించాలనుకున్నారు. రూ.లక్ష సబ్సిడీ అందించే పరికరాల మంజూరును సహాయ వ్యవసాయ సంచాలకులు చేయనుండగా.. ఆపై సబ్సిడీతో కూడిన పరికరాల మంజూరు అధికారం కలెక్టర్‌కు కేటాయించారు.

సర్వం సిద్ధం.. అయినా జాప్యం

యంత్రీకరణ పథకానికి సంబంధించిన ఫైల్‌ను వ్యవసాయ శాఖ సిద్ధం చేసింది. ఈ అంశంపై జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించి అమలుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాల్సి ఉంది. ఇక్కడే కాలయాపన జరుగుతోంది. ఈ దశ దాటితే పథకం కార్యరూపం దాల్చే అవకాశం ఉంది. జిల్లాలోని వ్యవసాయ డివిజన్ల వారీగా అర్హులైన రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ, లబ్ధిదారుల ఎంపిక, పరికరాల మంజూరు, వంటి అంశాలు అమలు జరిగే అవకాశం ఉంది. ప్రభుత్వం యాంత్రీకరణ పరికరాల పథకాన్ని ప్రకటిస్తే రైతులు వారికి అవసరమైన వ్యవసాయ పరికరాలు, యంత్రాలకు దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారు.

త్వరలోనే అమలు..



యాంత్రీకరణ పథకాన్ని అమలు చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. పథకంలో రైతులకు అందించే పరికరాలను గుర్తించాం. ఆయా పరికరాలకు నిర్దేశించిన విధంగా రాయితీలను అందిస్తాం. ఉన్నతాధికారుల అనుమతులతో పథకం అమలుకు చర్యలు తీసుకుంటాం.

–ధనసరి పుల్లయ్య, జిల్లా వ్యవసాయాధికారి

క్లుప్తంగా

రేపు ఎస్‌జీపీఏటీ జిల్లా సమావేశం



మాట్లాడుతున్న పరిశ పుల్లయ్య

ఖమ్మంసహకారనగర్: ఈ నెల 9వ తేదీన నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్‌జీపీఏటీ) జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య తెలి పారు. ఆదివారం నగరంలోని కృషిభవన్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించగా.. ఆయన మాట్లాడారు. కౌన్సిల్‌లో పెన్షనర్ల ప్రధాన సమస్యలను చర్చించటంతో పాటు ఉద్యమాలు, పోరాటాలకు కార్యాచరణ రూ పొందించనున్నామన్నారు. సమావేశంలో రాయల రవికుమార్, కృష్ణకుమారి, పెదమళ్ల సత్యనారాయణ, ఊడుగు వెంకటేశ్వర్లు, వీరభద్రరావు, ప్రసాద్ రావు తదితరులు పాల్గొన్నారు.

వాగులో మునిగి వ్యక్తి మృతి

దుమ్ముగూడెం: మండలంలోని పెద్దబండిరేవు సమీపంలోని గుబ్బలమంగి వాగులో ప్రమాదవశాత్తు మునిగి చిన్నబండిరేవు గ్రామానికి చెందిన పశువుల కాపరి పెనుగొండ వెంకన్న (55) మృతిచెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వెంకన్న పశువులను తీసుకుని గుబ్బలమంగి వాగు వైపు వెళ్లగా అక్కడ గేదె వాగులో దిగడంతో దానిని బయటకు తరలించేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ అశోక్‌కుమార్, సీఐ వెంకటప్పయ్య ఘటనా స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టగా వెంకన్న మృతదేహం లభ్యమైంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి,దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లోయలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్

గుండాల: కిన్నెరసాని నుంచి ఇసుక తోలుతున్న ఓ ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డు పక్కన లోయలోకి దూసుకెళ్లింది. ఇసుకలో కూరుకుపోయిన డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఎస్కే పాషా (65) ఇసుక తీసుకొచ్చేందుకు కిన్నెరసాని వాగుకు ట్రాక్టర్ డ్రైవర్‌గా వెళ్లాడు. ఇసుక లోడు చేసుకుని వచ్చే క్రమంలో సాయనపల్లి – గుండాల మార్గంలో దేవరచింత వద్ద రోడ్డు పక్కన గుంతలోకి పోయి.. అటుపక్కన లోయలోకి దూసుకెళ్లింది. పాషాకు చెట్ల కొమ్మలు తగిలి ఇంజన్ టైరు పక్కన పడి ఇసుకలో కూరుకుపోయి, అక్కడికక్కడే మృతి చెందాడు. గుండాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారు. కిన్నెరసాని వాగు నుంచి ఇసుకను ఇష్టానుసారంగా సమయపాలన లేకుండా, అధికారుల పర్యవేక్షణ లేకుండా తరలిస్తుండడంతో ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మాజీ సర్పంచ్ ఇంటిపై దాడి

పాల్వంచరూరల్: మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మాలోత్ హరి ఇంటిపై ఆదే గ్రామానికి చెందిన కొందరు యువకులు శనివారం రాత్రి దాడికి పాల్పడ్డారు. వినాయకుని ఊరేగింపు సందర్భంగా దుస్తుల విషయంలో తలెత్తిన వివాదంతో మాజీ సర్పంచ్ ఇంటిపై దాడి చేశారు. దీంతో హరి, ఆయన భార్య అనూష, తల్లి హచ్చమ్మ గాయపడ్డారు. బాధితులు ఫిర్యాదు చేశారని, విచారణ జరుపుతున్నామని, కేసు నమోదు చేయలేదని ఎస్ఐ సురేశ్ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.19,107

బాల్‌బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపిక



సబ్ జూనియర్ బాలికల జట్టు

బోనకల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో సబ్ జూనియర్, జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ జిల్లా జట్లను ఆదివారం ఎంపిక చేశారు. మొత్తం 80 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొనగా కోచ్ అమిరేశి లింగయ్య, జిల్లా అసోసియేషన్ కార్యదర్శి బొంతు శ్రీనివాసరావు, అధ్యక్షులు వి.సురేశ్‌కుమార్ క్రీడాకారులను ఎంపిక చేశారు. ఎంపికైనవారు ఈ నెల 14, 15 తేదీల్లో జరిగే 44వ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్, జూనియర్ పోటీల్లో ఆడనున్నారు. పోటీలు జనగాం జిల్లాలో జరుగుతాయని తెలిపారు.

ఎంపికైన క్రీడాకారులు సబ్ జూనియర్ బాలుర విభాగంలో జి.సురేశ్, బి.హర్షవర్ధన్, రెహమాన్, కె.వినయ్, మునీరుద్దీన్, ఎస్కే యాకూబ్‌పాషా, ఎస్కే నజీరుద్దీన్, ఎండీ ఆదాన్‌షమీ ఉన్నారు.

సబ్ జూనియర్ బాలికల విభాగంలో ఎస్.మనీషా, కె.నవ్య, కె.ఆకాంక్ష, ఆర్.సాహితి, కె.అక్షయ, డి.రాజేశ్వరి, ఎస్.మోక్షిత, సీహెచ్ సంగీత, టి.యశ్వంతి, కె.రిషిత, కె.అక్షయ్ ఉన్నారు.

జూనియర్ బాలుర జట్టుకు జి.గోపి, యాసర్, ఆదిల్, జ్యోషి, జి.గణేశ్, జయదీప్ మనాస్, సురేశ్, తనుష్, శ్రీహరి, ఎం.రఘురామ్, ఎం.శరణ్, జానకీరామ్ ఎంపికయ్యారు.

జూనియర్ బాలికల జట్టుకు జశ్వంతి, ఎ.రష్మీ, కె.మధులత, యూహిత, ఎస్.మనీషా, కె.నవ్య, కె.ఆకాంక్ష, ఆర్.సాహితి, కె.అక్షయ్, వి.రాజేశ్వరి, పి.ఉమామహేశ్వరి, భూలక్ష్మీ తదితరులు ఎంపికయ్యారు.

వివాహిత అదృశ్యం



తులసి (ఫైల్)

భద్రాచలంఅర్బన్: వివాహిత కనిపించకుండా పోయిన ఘటనపై భద్రాచలంటౌన్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశా రు. నిత్యం సెల్‌ఫోన్‌లో మాట్లాడుతోందని రాయపూడి తులసిని తన భర్త కృష్ణయ్య శనివారం రాత్రి మందలించాడు. అదే రోజు రోజు రాత్రి 11 గంటల సమయంలో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి ఇంతవరకు రాకపోవడంతో ఆచూకీ కోసం బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఫలితం లేకపోయింది. ఆదివారం ఆమె భర్త కృష్ణయ్య ఫిర్యాదు మేరకు టౌన్ ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్‌ఎస్‌పై బురదజల్లే ప్రయత్నం..

బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రాకేశ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఏనుగుల రాకేశ్‌రెడ్డి

ఖమ్మవైరారోడ్: కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కాంగ్రెస్ రాజకీయం చేస్తూ బీఆర్‌ఎస్‌పై బురదజల్లే ప్రయత్నం చేస్తోందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి మండిపడ్డారు. బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తలాపున గోదావరి పారుతున్నప్పటికీ తాగడానికి నీళ్లు లేని దుస్థితి ఉండేదని, కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో నీటి సమస్య తీరిందన్నారు. కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద 281 టీఎంసీల నీటి లభ్యత ఉండటం వల్ల మేడిగడ్డకు ప్రాజెక్ట్‌ను తరలించారన్నారు. మేడిగడ్డ దగ్గర 2 పిల్లర్లు కుంగితే మొత్తం కాళేశ్వరమే కుంగిందని కాంగ్రెస్ ప్రచారం చేస్తోందని ఆరోపించారు. కన్నెపల్లి పంప్ హౌస్ వద్ద 93 మీటర్ల ఎత్తులో గోదావరి ప్రవహిస్తే మోటార్లు ప్రారంభించి నీటిని ఎత్తిపోయవచ్చని, గతంలో లాగే ఇప్పుడు కూడా అన్నారం, మేడిగడ్డ, సుందిళ్లలో అన్ని గేట్లు ఎత్తేసి అన్ని పంపులను పడావు పడేలా చేశారని తెలిపారు. కాకతీయులు గొలుసుకట్టు చెరువులు నిర్మిస్తే, కేసీఆర్ గొలుసుకట్టు రిజర్వాయర్లు నిర్మించారన్నారు. సమావేశంలో పగడాల నాగరాజు, బిచ్చాల తిరుమల్‌రావు, డోకుపర్తి సుబ్బారావు, మందడపు శంకర్‌రావు, పగడాల నరేందర్, కొండల్‌రావు, మురళీకృష్ణ, రఫీ, గోపి, రాజేశ్, అశోక్‌సింగ్, షారుక్ అరాఫత్ పాల్గొన్నారు.

మావోయిస్ట్ ఆయుధ తయారీ కేంద్రం గుర్తింపు



బలగాలు గుర్తించిన ఆయుధ తయారీ సామగ్రి

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులకు సంబంధించిన ఆయుధాల తయారీ కేంద్రాన్ని ఆదివారం భద్రతా బలగా లు గుర్తించా యి. వివరాలిలా ఉన్నాయి. బీజాపూర్ జిల్లాలోని ఊసూరు పోలీస్ స్టేషన్ పరిధిలో గల గుంజపర్తి అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టిన గుంజపర్తి క్యాంపునకు చెందిన భద్రతా బలగాలు సమీప అటవీ ప్రాంతంలో మావోయిస్టులకు సంబధించిన ఆయుదాల తయారీ కేంద్రాన్ని గుర్తించాయి. ఈ కేంద్రంలో లేత్ మిషిన్, జనరేటర్, వాటర్ పంప్, ఎలక్ట్రిక్ కట్టర్, హైడ్రాలిక్ సిలిండర్, మోటారు విడి భాగాలు, స్టీల్ ప్లేట్లు, ఆయుధాల తయారీకి ఉపయోగించే విడి సామగ్రితో పాటు పెద్ద మొత్తంలో పేలుడు పదార్థాలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాటిని అక్కడే ధ్వంసం చేశారు.

జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు మృతి

పలు పార్టీల నాయకుల సంతాపం



ఎస్డీ జియాఉద్దీన్ (ఫైల్)

తిరుమలాయపాలెం: జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు, యూటీఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి, సీపీఎం మండల మాజీ కార్యదర్శి సుబ్లేడు గ్రామానికి చెందిన ఎస్డీ జియాఉద్దీన్ (76) ఆదివారం గుండెపోటుతో మృతిచెందారు. ఖమ్మంలోని ఆయన నివాసంలో పలు పార్టీల నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బెల్లం శ్రీనివాస్, బోడ మంచానాయక్, అర్మి రవి, తుళ్లూరు నాగేశ్వరరావు, నర్సయ్య, రమేశ్, స్వామి, బాబూరావు, నిర్మల్‌రావు, ఉపేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జియాఉద్దీన్ మృతి తీరని లోటు



జియాఉద్దీన్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు

ఖమ్మంసహకారనగర్: ఉపాధ్యాయ, ప్రజా ఉద్యమ నేత జియాఉద్దీన్ ఆకస్మిక మృతి తీరని లోటని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చావా రవి, ఎ.వెంకట్ అన్నారు. నగరంలో ఆదివారం జరిగిన సంస్మరణ సభలో వారు మాట్లాడారు. జియాఉద్దీన్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర కార్యదర్శిగా, జిల్లా ప్రజా పరిషత్ కోఆప్షన్ సభ్యుడిగా సేవలందించారని తెలిపారు. కార్యక్రమంలో దుర్గాభవాని, మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, షేక్ రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు, నున్నా నాగేశ్వరరావు, మచ్చ వెంకటేశ్వర్లు, పొన్నం వెంకటేశ్వరరావు, సోమయ్య విక్రమ్, సాయిబాబు, సరళ, హైమావతి పాల్గొన్నారు. కాగా, జియాఉద్దీన్ మృతి పట్ల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, మాజీ ఎంపీ తమ్మినేని వీరభద్రం వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



జలగం నర్సయ్య (ఫైల్)

ఖమ్మంరూరల్: ఓ వ్యక్తి కనిపించకుండా పోయిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని కాచిరాజుగూడెం గ్రామానికి చెందిన జలగం నర్సయ్య (48) గత నెల 28న ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. ఇంట్లో గొడవ పెట్టుకుని, ఖమ్మం వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎక్కడ ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. ఇతను నీలం రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ ముష్క రాజు తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

సత్తుపల్లిరూరల్: కలుపుమందు సేవించి ఓ వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని సిద్ధారంలో ఆదివారం చోటుచేసుకుంది. సిద్ధారానికి చెందిన మోరంపూడి మాధవరావు (68) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ.. ఇటీవల హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నాడు. శనివారం రాత్రి ఇంట్లో ఉన్న కలుపుమందు తాగగా కుటుంబ సభ్యు లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య సరోజిని, కుమార్తె సత్యవాణి ఉన్నారు. ఏఎస్ఐ ప్రతాప్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొన్న టిప్పర్

ఖమ్మంఅర్బన్: నగరంలోని ఇల్లెందు రోడ్డులో ఎన్నెస్పీ కాల్వ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. రఘునాథపాలెం మండలం రాంక్యాతండాకు చెందిన కేలోతు రవి, ఆయన భార్య కమల ద్విచక్రవాహనంపై వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన టిప్పర్ ఢీకొంది. ఈ ఘటనలో రవి గాయపడి చికిత్స పొందుతున్నాడు. కమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ భానుప్రకాశ్ తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు

ఖమ్మంఅర్బన్: నిమజ్జన వేడుకల విధుల్లో ఉన్న ఇద్దరు ఎస్ఐలను మద్యం మత్తులో ముగ్గురు యువకులు నెట్టివేసిన ఘటన శనివారం రాత్రి ఖమ్మం నగరంలో చోటుచేసుకుంది. దీంతో ఆ ముగ్గురు యువకులపై ఆదివారం ఖమ్మం అర్బన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఖానాపురం యూపీహెచ్ కాలనీకి చెందిన కొందరు యువకులు గణేశ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఊరేగింపుతో నిమజ్జనానికి బయలుదేరారు. రాత్రి 11.30 గంటల సమయంలో భారీ డీజే పాటలకు డ్యాన్సులు చేస్తూ వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగించారు. విధుల్లో ఉన్న ఖమ్మంఅర్బన్ (ఖానాపురంహవేలి) ఎస్ఐ మధుకుమార్ అక్కడికి చేరుకుని డీజే వాహనాన్ని పంపించగా, నిమజ్జన వాహనాన్ని తరలించాలని చెప్పినప్పటికీ వినకుండా మద్యం మత్తులో ఉన్న మహేశ్, మాధవరావు, బాలు ఆయనను నెట్టివేశారు. అక్కడికి చేరుకున్న మరో ఎస్ఐ శ్రావణ్‌తో కూడా అదే రీతిలో ప్రవర్తించారు. వెంటనే ఎస్ఐలు ఉన్నతాధికారులకు సమాచారం అందించి, విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి, వారిపై కేసు నమోదు చేశారు.

14 నుంచి సింగరేణి ఆస్పత్రుల్లో కార్పొరేట్ సేవలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఈ నెల 14 నుంచి హైదరాబాద్ కార్పొరేట్ వైద్యులు సింగరేణి ఆస్పత్రులను సందర్శించనున్నారని సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ కిరణ్‌రాజ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21న కొత్తగూడెంలోని ఆస్పత్రికి కార్డియాలజీ, న్యూరాలజీ, యూరాలజీ, నెఫ్రాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు రానున్నారని పేర్కొన్నారు.

జేఎంఈటీలు మళ్లీ ఉద్యోగంలోకి..

- టర్మినేట్ అయిన 43 మంది పునర్నియామకం
- సింగరేణి చరిత్రలో తొలిసారి అవకాశం

సింగరేణి(కొత్తగూడెం): అధికార హోదా (జేఎంఈటీ–జూనియర్ మైనింగ్ ఇంజనీర్ (ట్రెయినీ)లో ఉండి టర్మినేట్ అయిన 43 మంది అధికారులను తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోనున్నారు. వారు విధులకు సక్రమంగా హాజరుకాకపోవడం, నిర్ణీత గడువులోకి స్టడీ సర్టిఫికెట్లు సమర్పించకపోవడంతో పాటు పలు కారణాలతో టర్మినేట్ అయ్యారు. దీంతో యాజమాన్యం వారికి మరో అవకాశం కల్పించింది. 2023లో గుర్తింపు సంఘంగా ఎన్నికైన ఏఐటీయూసీ జేఎంఈటీల సమస్యను తెలుసుకుంది. అనంతరం యూనియన్ నాయకులు యాజమాన్యం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లడంతో యాజమాన్యం ఈ నెల 6వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. అయితే వీరంతా సంస్థ ఏర్పాటు చేసిన హైకమిటీ ఎదుట తమ వివరాలు 45 ఏళ్లకు తక్కువ కాకుండా ఉండి, (ఓవర్‌మెన్ సర్టిఫికెట్, గ్యాస్ టెస్టింగ్, ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికెట్లు) సమర్పించుకోవాల్సి ఉంది. కమిటీ సూచన మేరకు ఫిట్‌నెస్ పరీక్షలకు హాజరుకావాల్సి ఉంది.

ప్రాథమిక అపాయింట్‌మెంట్ జారీ

అన్ని పరీక్షలు పూర్తి అయితేనే జేఎంఈటీలకు ప్రాథమిక అపాయింట్‌మెంట్‌ను సంస్థ జారీ చేస్తుంది. తిరిగి ఉద్యోగంలో చేరిన జేఎంఈటీలకు గ్రేడ్–సీ, ప్రాథమిక నియామకం అందిస్తారు. తొలి ఏడాదిలో 190 మస్టర్లు తగ్గకుండా చేస్తే పర్మనెంట్ ఉద్యోగం వచ్చినట్లవుతుంది. లదంటే తిరిగి టర్మినేట్ అవుతారు.

మరో అవకాశం అదృష్టం



గతంలో బదిలీ వర్కర్లు, జనరల్ అసిస్టెంట్లు వివిధ కారణాలతో డిస్మిస్ అయితే సంస్థ వారికి ఉద్యోగ అవకాశం కల్పించేది. కానీ, సింగరేణిలో తొలిసారిగా టర్మినేట్ అయిన జేఎంఈటీలకు మరో అవకాశం కల్పించటం వారి అదృష్టం. ఇప్పటికైనా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కష్టపడి పనిచేసి, సంస్థ అభివృద్ధికి కృషి చేయాలి.

–ఎన్.బలరాం, సీఎండీ, సింగరేణి


18 మాసాల కృషి..



పలు కారణాలతో టర్మినేట్ అయిన జేఎంఈటీలను విధుల్లోకి తీసుకోవాలని యాజమాన్యంతో కొట్లాడాం. బీడీఓ మీటింగ్, ఆర్ఎల్‌సీ సమక్షంలో చర్చించాం. స్పందించిన అధికారులు వీరికి మరో అవకాశం కల్పించారు.

–వాసిరెడ్డి సీతారామయ్య, ఏఐటీయూసీ ప్రధాన కార్యాదర్శి


సద్వినియోగం చేసుకుంటాం



కంపెనీ అందించిన అవకాశాన్ని గతంలో మేము సద్వినియోగం చేసుకోలేకపోయాం. యూనియన్ నాయకులను, అధికారులను కలిసి, ఐదేళ్లు చేసిన పోరాటం ఫలితంగా సంస్థ మరో అవకాశం కల్పించింది. ఈసారి సద్వినియోగం చేసుకొని ఉన్నతస్థాయికి చేరుకుంటాం.

–పి.శ్రీచరణ్, జేఎంఈటీ

పస్తులు ఉన్నాం..



నేను చేసిన చిన్న తప్పిదం కుటుంబాన్ని పస్తుల్లోకి నెట్టింది. 2022 నుంచి నేటి వరకు జీతం లేక ఆర్థికంగా దుర్భర జీవితాన్ని అనుభవించాం. టర్మినేట్ అయిన నేపథ్యంలో తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యాడు. యూనియన్ నాయకులు, అధికారులు స్పందించి మాకు కొత్త జీవితం ప్రసాదించారు.

–టి.శ్రీకాంత్, జేఎంఈటీ